క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ప్రతిష్ట మహోత్సవం



ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని రావినూతల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన కోదండరామస్వామి ఆలయంలో దేవతామూర్తులను గురువారం భక్తిశ్రద్ధలతో వేద పండితుల మంత్రోచ్చరణలతో ప్రతిష్టించారు. కోదండరామస్వామి, సీతాదేవి, లక్ష్మణుడు, హనుమంతుని విగ్రహాలను ప్రతిష్టించారు. కార్యక్రమంలో శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య, మాజీ ఎమ్మెల్యేలు బాచిన చెంచుగరటయ్య, ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పాల్గొని స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

నేటి నుంచి వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు

యద్దనపూడి: పూనూరు గ్రామంలో వేంచేసి ఉన్న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతాయని ఎండోమెంట్ ఈవో నాగయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది ఏరువాక పౌర్ణమి సందర్భంగా స్వామివారికి బ్రహ్మోత్సవాలు నిర్వహించటం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం విశ్వక్షేణపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, గరుడపతావిష్కరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

3,4 తేదీల్లో సృజన సాహిత్య పురస్కార సభలు

అద్దంకి రూరల్: గాడేపల్లి సీతారామమూర్తి స్మారక సృజన సాహిత్య పురస్కార సభలు ఈనెల 3, 4వ తేదీల్లో స్థానిక కాళిరా సమేత కమతేశ్వరస్వామి ఆలయంలో సాయంత్రం 5.30 గంటలకు నిర్వహించనున్నట్లు సృజన అద్దంకి అధ్యక్షుడు గాడేపల్లి దివాకరదత్తు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తేదీ శనివారం 2021 సంవత్సర సాహిత్య పురస్కారం, ఆటా, కేంద్ర సాహిత్య అకాడెమి పురస్కార గ్రహీత ఆచార్య మధురాంతకం నరేంద్రకు, 4వ తేదీ ఆదివారం 2022 సంవత్సర సాహిత్య పురస్కారం యునెస్కో అవార్డు గ్రహీత, జానపద సాహిత్య వేత్త ఆచార్య పేట శ్రీనివాసులరెడ్డికి అందజేయనున్నట్లు తెలిపారు. సాహితీవేత్తలు, సాహిత్యాభిలాషులు పాల్గొన్నాలని వారు కోరారు.

వృద్ధాప్య సహాయ పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

అద్దంకి రూరల్: ఏపీఎస్ ఆర్టీసీ, క్రెడిట్ కో ఆపరేటివ్ రిటైర్డు ఉద్యోగులకు ప్రవేశపెట్టిన వృద్ధాప్య సహాయ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు పీసీహెచ్ కోటయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కేటగిరిలో పనిచేస్తూ సీసీఎస్‌లో సభ్యత్వం కలిగి ఉండి రిటైర్డు అయిన వారు దరఖాస్తు పెట్టుకోవాలన్నారు. ఈనెల 30 తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు అద్దంకి డిపో కమిటీ వద్ద అభిస్తాయని తెలిపారు. వివరాలకు 95536 68769, 91218 99442 నంబర్లను సంప్రదించాలన్నారు.

వ్యక్తికి గాయాలు

మేదరమెట్ల: బైకు అదుపుతప్పడంతో ఒవ్యక్తికి గాయాలయ్యాయి. ఈఘటన మండల కేంద్రం కొరిశపాడు జాతీయరహదారిపై ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో గురువారం జరిగింది. అందిన సమాచారం మేరకు.. కొరిశపాడు గ్రామానికి చెందిన ఆర్ రవితేజ తన బైకుపై వెళ్తున్నాడు. స్పీడ్ బ్రేకర్ వద్దకు రాగానే బైక్‌ను నియంత్రించలేక అదుపుతప్పింది. దీంతో రవితేజకు తీవ్ర గాయాలు కాగా ఎన్‌హెచ్ అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.

తమ్ముడిపై దాడి అన్నకు రిమాండ్

చినగంజాం: తమ్ముడిపై దాడి చేసి గాయపరచిన అన్నకు కోర్టు రిమాండ్ విధించింది. చినగంజాం ఎస్సై కొమరిశెట్టి సురేష్ అందించిన వివరాల మేరకు.. మండలంలోని సోపిరాల గ్రామానికి చెందిన గోగన నాగరాజు మద్యానికి అలవాట్లకు లోనై అనవసరంగా డబ్బు ఖర్చు చేస్తుండటంతో అతని తమ్ముడు గోగన శివశంకర్ చెడు అలవాట్లను మానుకోమని హెచ్చరించాడు. అది మనసులో పెట్టుకున్న అన్న నాగరాజు, గత నెల 10వ తేదీన తమ్ముడు శివశంకర్ ఉలవల కోసం రాత్రి 9.30 గంటల సమయంలో సోపిరాల ఆంజనేయ స్వామి గుడి వద్ద ఉండగా నాగరాజు రాడ్‌తో దాడికి పాల్పడ్డాడు. గాయాలవడంతో ఒంగోలు రిమ్సులో చికిత్స పొందాడు. శివశంకర్ ఫిర్యాదుతో అన్న నాగరాజును గురువారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించిందని పోలీసులు చెప్పారు.

కారు, పాల వ్యాను ఢీ

అద్దంకి రూరల్: కారు, పాలవ్యాను అద్దంకిలోని దర్శిరోడ్డులో గురువారం రాత్రి జరిగింది. అందిన సమాచారం మేరకు అద్దంకి చెందిన కారు, దర్శివైపు నుంచి వస్తున్న కారు అద్దంకిలోని దర్శిరోడ్డులోని గుండ్ల కమ్మ బ్రిడ్జి మీదకు రాగానే ఎదురెదురుగా వచ్చి ఢీకొట్టుకున్నాయి. ఈ ఘటనలో ఎవరికి ఏమి కాలేదు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో ఘటనా స్థలానికి ఎస్సై సమందరేవలి చేరుకుని అంతరాయం లేకుండా చేశారు.

ఈదురుగాలులతో జనం బెంబేలు

- చీరాలలో నేలకొరిగిన భారీ వృక్షాలు
- కొత్తపేట ఓంకార క్షేత్రంలో విరిగి పడిన ధ్వజస్తంభం
- నిలిచిన విద్యుత్ సరఫరా
- తీవ్రంగా శ్రమించిన విద్యుత్ సిబ్బంది



చినగంజాంలో పడిపోయిన 11 కేవీ విద్యుత్ స్తంభం



ఐఎల్‌టీడీ వద్ద చెట్లు పడిపోవడంతో అధికారులతో మాట్లాడుతున్న వెంకటేష్



బాలాజీ థియేటర్ వద్ద చెట్టు పడడంతో తెగిపోయిన విద్యుత్ వైర్లు

చీరాల అర్బన్: చీరాలలో గురువారం ఈదురుగాలులు బీభత్సాన్ని సృష్టించాయి. మధ్యాహ్నం కురిసిన వర్షంతో పాటు బలంగా వీచిన ఈదురుగాలులు కారణంగా పట్టణంలో భారీ వృక్షాలు నేలకొరిగాయి. సుమారు రెండు గంటల పాటు ఎడతెరపి లేకుండా ఉరుములు, మెరుపులు, భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. గాలివాన బీభత్సానికి చీరాల పట్టణంలోని పలు ప్రాంతాలలో చెట్లు, హోర్డింగ్‌లు నేలకొరిగి రోడ్లపై పడ్డాయి. అలానే రైల్వేఓవర్ బ్రిడ్జిపై ఉన్న స్ట్రీట్ లైట్ స్తంభాలు విరిగిపడ్డాయి. అలానే వాడరేవు రోడ్డులో బాలాజీ థియేటర్ వద్ద ఉన్న భారీ వృక్షం గాలులలకు పక్కనే ఉన్న విద్యుత్ వైర్లపై పడడంతో రెండు విద్యుత్ స్తంభాలు విరిగాయి. అలానే బెస్తపాలెంలోని సచివాలయంలో ఉన్న చెట్టు కూడా కూలిపోయింది. చీరాల రూరల్ మండలం ఈపూరుపాలెంలో చీరాల–బాపట్ల రహదారి ప్రక్కన ఉన్న చెట్టు రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కొత్తపేటలోని ఓంకార క్షేత్రంలో ధ్వజస్తంబం గాలులకు కూలిపోయింది. గంటలకు సుమారు 60 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీయడంతో పాటు ఈ విధంగా చెట్లు పడిపోవడంతో ఇటీవల కాలంలో చూడలేదని స్థానికులు చెప్తున్నారు.

నిలిచిన విద్యుత్ సరఫరా..

ఈదురుగాలుల బీభత్సానికి మధ్యాహ్నం 3గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈదురుగాలులకు చీరాల, రూరల్ మండలంలో ఇప్పటివరకు 60 విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. విద్యుత్ వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో చీరాల పట్టణం అంధకారంలో ఉంది. బాలాజీ థియేటర్ వద్ద భారీ చెట్టు విద్యుత్ వైర్లుపై పడడంతో విద్యుత్ వైర్లు తెగిపోయాయి. మున్సిపల్ అధికారులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని విరిగిన చెట్టును ముక్కలు చేసి రాకపోకలు ఇబ్బందులు లేకుండా చేశారు. అలానే విద్యుత్ శాఖ అధికారులు పట్టణంలో అన్ని ప్రాంతాలలో పరిశీలన చేసి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. ఏ ప్రాంతంలో విద్యుత్ సమస్య ఉందో గుర్తించి సాధ్యమైనంత త్వరగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామన్నారు. విద్యుత్‌వైర్లతో పాటు కేబుల్, ఇంటర్నెట్ వైర్లు కూడా తెగిపోవడంతో ఇంటర్నెట్, టీవీ ప్రసారాలకు అంతరాయం ఏర్పడింది.

సహాయక చర్యలను పరిశీలించిన కరణం వెంకటేష్..

పట్టణంలో ఈదురుగాలుల బీభత్సానికి విరిగిపడిన చెట్లు, విద్యుత్ స్తంభాల తొలగింపు చర్యలను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ స్వయంగా పరిశీలించారు. ప్రమాద ప్రదేశాలను పరిశీలించి అక్కడి వారికి ఏమైనా ప్రమాదం జరిగిందా అని అధికారులను ఆరా తీశారు. అలానే విద్యుత్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని సూచించారు. అలానే ఏడో వార్డులో మరమ్మతుల పనులను ఆయన పరిశీలించి విద్యుత్, రెవెన్యూ అధికారులతో మాట్లాడి స్వయంగా పర్యవేక్షించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తానని ప్రజలకు భరోసా కల్పించారు. ఆయన వెంట తహసీల్దార్ జి.ప్రభాకర రావు, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాస రావు, కౌన్సిలర్ కె.యానాదిరావు, కీర్తి వెంకట్రావు, పార్టీ నాయకులు యాతం మేరిబాబు, యాతం సునీల్, స్థానికులు ఉన్నారు.

చినగంజాం: అకస్మాత్తుగా గారిదుమారం చెలరేగడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మండలంలో గురువారం సాయంత్రం వీచిన ఈదురుగాలులతో 11 కేవీ విద్యుత్ స్తంభం నేలకొరిగింది. మండల భవన సముదాయం వెనుక వైపు ఉన్న స్తంభం పూర్తిగా పడిపోయింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో విద్యుత్ శాఖాధికారులు గాలుల తీవ్రతను గమనించి అప్రమత్తంగా ఉండి ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకుండా జాగ్రత్త పడ్డారు. దాంతో చినగంజాం విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి మండలంలోని చింతగుంపల, గొనసపూడి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సకాలంలో స్పందించిన విద్యుత్ శాఖ సిబ్బంది ఏఈ గణనారాయణ ఆధ్వర్యంలో పడిపోయిన 11 కేవీ విద్యుత్ స్తంభాన్ని సిబ్బంది సహాయంతో వెంటనే నిలబెట్టడంతో సాయంత్రం 8 గంటల్లోపు విద్యుత్ సరఫరాలను పునరుద్ధరించి ఆయా గ్రామాల ప్రజలకు ఇబ్బంది లేకుండా చేశారు.

కారంచేడులో ఈదురుగాలులు..

కారంచేడు: గురువారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఒక్కసారిగా ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. ఉదయం నుంచి అప్పటివరకు విపరీతమైన ఎండవేడితో అల్లాడిన ప్రజలు ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఉరుములు, మెరుపులతో పాటు, చెట్లు కూడా పడిపోయేంతగా ఈదురు గాలులు వీస్తుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. గ్రామంలో విద్యుత్ తీగలు తెగిపోవడం వలన విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



బాలాజీ థియేటర్ వద్ద ప్రజలతో మాట్లాడుతున్న వెంకటేష్



కొత్తపేట ఓంకార క్షేత్రంలో పడిపోయిన ధ్వజస్తంభం



ఈపూరుపాలెంలో రోడ్డుకు అడ్డంగా పడిపోయిన భారీ వృక్షం

ఉద్రిక్తతల నివారణకు ప్రత్యేక చర్యలు



గ్రామంలో పికెట్ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది



జన సంచారం లేకుండా నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

- డీఎస్పీ ప్రసాదరావు

వేటపాలెం: మత్స్యకార గ్రామంలో ఇరువర్గాల మధ్య ఉద్రిక్తతల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చీరాల డీఎస్పీ ప్రసాదరావు గురువారం తెలిపారు. రామాపురం గ్రామంలో శాంతి, భద్రతలు అదుపులో ఉన్నాయన్నారు. ఘర్షణకు కారణమైన వారిపై కేసులు నమోదు చేశామని, వారిని త్వరలో అరెస్టు చేయనున్నట్లు తెలిపారు. గ్రామంలో చీరాల, చీరాల రూరల్, వేటపాలెం పోలీసు స్టేషన్ పరిధిలోని ఇద్దరు సీఐలు, ముగ్గురు ఎస్సైలు, ఏఎస్సైలు దాదాపు 50 మంది సిబ్బందితో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామన్నారు. గ్రామంలో కఠారివారిపాలెం గ్రామం నుంచి వచ్చిన వారిపై దాడులు చేయడానికి ముందుగానే వేసుకున్న పథకం ప్రకారం మెజారిటీ వర్గానికి చెందిన వారు మూడు కుటుంబాలపై దాడులకు పాల్పడినట్లు విచారణలో తెలిందన్నారు. తిరిగి గ్రామంలో శాంతి భద్రతలు నెలకొనే వరకు పికెట్ కొనసాగిస్తామని తెలిపారు. ఎటువంటి ఉద్రిక్తలు చోటు చేసుకోకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్



కార్యక్రమంలో పాల్గొన్న ఇన్‌చార్జి వెంకటేష్

చీరాల: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. గురువారం రాత్రి స్థానిక ఐఎంఏ హాలులో 'ఆంధ్రప్రదేశ్ ప్రజలు–వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ఎందుకు కోరుకుంటున్నారు '.. । అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి నియోజకవర్గస్థాయి పార్టీ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల ముందు వైఎస్ జగన్ చేపట్టిన ప్రజాసంకల్పయాత్రలో రాష్ట్ర ప్రజల సమస్యలను ఆయన స్వయంగా చూసి వారికి ఏ పథకాలు అవసరమో తెలుసుకొని మేనిఫెస్టోలో రూపొందించారన్నారు. ప్రజలు జగన్ మోహన్‌రెడ్డిపై ఉన్న నమ్మకంతో ఆయనకు పట్టం కట్టారన్నారు. అధికారం చేపట్టిన తర్వాత మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నాలుగేళ్ల ప్రభుత్వ కాలంలో 98 శాతం మేర నెరవేర్చారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. దళారీ వ్యవస్థను రూపుమాపి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే సంక్షేమ పథకాల సొమ్మును జమ చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ సీపీకే పట్టం కడతారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కో–ఆప్షన్ మెంబర్లు, మాజీ జెడ్పీటీసీలు, మండల కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక కిట్లు సిద్ధం



మాట్లాడుతున్న ఎంఈవో సుబ్రమణ్యేశ్వరరావు

యద్దనపూడి: ఈ నెల 12వ తేదీలోపు ప్రభుత్వ పాఠశాలలు తెరిచేనాటికి అన్ని పాఠశాలల్లో జగనన్న విద్యాకానుక కిట్లు సిద్ధంగా ఉండేలా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నట్లు ఎంఈవో సుబ్రమణ్యేశ్వరావు అన్నారు. గురువారం ఎమ్మార్సీ కార్యాలయంలో ఉన్న జగనన్న విద్యాకానుక కిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాకానుక కిట్లను పంపిణీ చేసిన వెంటనే రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం నాడు–నేడు పాఠశాలలకు సంబంధించి హెచ్‌ఎంలు ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి పనులన్ని నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకట్రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఖాలేషా, సీఆర్పీలు ప్రేమ్‌కుమార్, మస్తాన్‌వలి, జీవన్ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఉపసర్పంచ్, తదితరులు

చినగంజాం: మండలంలోని మున్నంవారిపాలెం పంచాయతీ పరిధిలోని బేతాళవారిపాలెం గ్రామంలో కమ్యూనిటీ భవనానికి గ్రామ ఉప సర్పంచ్ బేతాళ మునిరత్నం గురువారం శంకుస్థాపన చేశారు. బాపట్ల ఎంపీ నందిగం సురేష్ నిధులు రూ.6 లక్షలతో భవనాన్ని నిర్మాణం చేసేందుకు పంచాయతీ తీర్మానం చేయడంతో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నల్లమోపు జయసింహారెడ్డి, మాజీ సర్పంచ్ బేతాళ మోహనరావు, భాస్కర్‌రెడ్డి, కొప్పోలు యలమంద, రఘురామరెడ్డి, నారపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంకమ్మతల్లి కొలుపులు



వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ

సంతమాగులూరు (అద్దంకి రూరల్): గ్రామ దేవత అంకమ్మతల్లి కొలుపులను సంతమాగులూరులో గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. దీనిలో భక్తులు ఉదయం నుంచి అమ్మవారికి పొంగళ్లు పెట్టి నివేదించారు. ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. రాత్రికి వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ ప్రభపై సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కన్నుల పండువగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న మహిళా భక్తులు

మేదరమెట్ల: కొరిశపాడు మండలం పమిడిపాడు పంచాయతీ పరిధిలోని కృష్ణంరాజువారిపాలెం గ్రామంలో కొలువైయున్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్షిక తిరునాళ్లు కన్నుల పండువగా నిర్వహించారు. స్వామివార్ల కల్యాణ మహోత్సవం అనంతరం బుధవారం రాత్రి స్వామివార్లను నూతనంగా ఏర్పాటు చేసిన రథంపై ఉంచి గ్రామంలో రథత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు రథాన్ని లాగుతూ స్వామివార్లను స్మరించుకున్నారు.

మంచి వ్యక్తి అశోక్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం

చీరాల: మంచి వ్యక్తిత్వం, సేవా తత్పరులు మాజీ మున్సిపల్ చైర్మన్ బొనిగల అశోక్‌కుమార్ అని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ బొనిగల అశోక్‌కుమార్ కాంస్య విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన కార్యక్రమాన్ని గురువారం స్థానిక సంగం థియేటర్ వద్ద నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వరికూటి అమృతపాణిలు హాజరయ్యారు. చీరాల మున్సిపల్ చైర్మన్‌గా బొనిగల అశోక్‌కుమార్ పనిచేసిన కాలంలో చీరాల పట్టణంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్లు బొనిగల జైసన్ బాబు, శిఖాకొల్లి రామసుబ్బులు, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, మున్సిపల్ డీఈ ఏసయ్య, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సజ్జలను కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు



సజ్జల, బాలినేనితో మాట్లాడుతున్న నాయకులు

చినగంజాం: చినగంజాం మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి గురువారం రాత్రి కలిశారు. మాజీ మంత్రి, ఒంగోలు శాసన సభ్యుడు బాలినేని శ్రీనివాసరెడ్డితో కలిసి వారు తాడేపల్లిలోని సజ్జల రామకృష్ణారెడ్డి కార్యాలయంలో ఆయనను కలిసి పర్చూరు నియోజకవర్గ రాజకీయ పరిస్థితులను గురించి చర్చించారు.

కార్యక్రమంలో ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి, తోటవారి ధర్మసత్రం చైర్మన్ తుమ్మలపెంట శ్రీనివాసరావు, ఇంకొల్లు మాజీ జడ్పీటీసీ భవనం శ్రీనివాసరెడ్డి, బాపిరెడ్డి, పెదగంజాం సర్పంచ్ నక్కల కృష్ణ, మోటుపల్లి సర్పంచ్ వడ్లమూడి సాంబశివరావు, పెదగంజాం ఎంపీటీసీ యల్లావుల తిరుపతిరావు, మండల మాజీ కన్వీనర్ కోట విజయభాస్కరరెడ్డి, కోమట్ల కోదండ రామిరెడ్డి, అడుసుమల్లి అంకమ్మరావు, దేవరకొండ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు నిర్లక్ష్యం వీడకుంటే చర్యలు



సిబ్బంది పనితీరును పరిశీలిస్తున్న ఎంపీడీవో విజయలక్ష్మి

కారంచేడు: సచివాలయాల్లో విధులు నిర్వహించే సిబ్బందిలో కొంతమంది నిర్లక్ష్యంగా ఉండటం వలన ఇబ్బందులు ఎదురవుతున్నాయని, తీరుమార్చుకోకపోతే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో డీ విజయలక్ష్మి హెచ్చరించారు. గురువారం మండలంలోని జరుబులవారిపాలెం గ్రామ సచివాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె అన్ని శాఖల సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బందిలో వైద్య సిబ్బంది, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీసులు మోడరేట్ ఎనీమియా కేసులను సాధారణ స్థితికి తీసుకురావాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రంలో రిజిస్టర్‌లు సక్రమంగా లేవనే విషయాన్ని గ్రహించి ఒక వారంలో మరలా పరిశీలనకు వస్తానని, అప్పటిలోగా సరిచేసుకోవాలని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి జయప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ క్రీడాకారులకు యూనిఫాం పంపిణీ



క్రీడాకారులకు దుస్తులందజేస్తున్న అతిథులు

చీరాల రూరల్: ఫుట్‌బాల్ కోచింగ్ ముగింపు కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం చీరాల మున్సిపల్ హైస్కూల్ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రీడాకారులకు దాతలు సమకూర్చిన క్రీడాదుస్తులను అందజేశారు. కార్యక్రమంలో రామకృష్ణ, దరియా, సుభాషిణి, జగన్‌మోహనరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. బొనిగల ప్రేమయ్య, 78 మంది బాలబాలికలు, తల్లిదండ్రులు, కోచ్‌లు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో 500వ నేత్రదానం పూర్తి

ఇంకొల్లు (చినగంజాం): ఇంకొల్లు రోటరీ క్లబ్ అవయవదాన కమిటీ పేరుతో తలపెట్టిన మహా యజ్ఞం గురువారం తాటిపర్తివారిపాలెం దాత కోయి శ్రీనివాసరావు నేత్రాలను సేకరించడంతో 500 నేత్రదానాలను పూర్తి చేసిన ఘనత సాధించింది. గురువారం మండలంలోని తాటిపర్తి వారిపాలెం గ్రామానికి చెందిన శ్రీనివాసరావు (55) మృతి చెందడంతో భార్య లక్ష్మీ పద్మావతి, కుటుంబ సభ్యులు శరత్‌బాబు, నిరంజన్‌రావు, రత్నరావుల అంగీకారంతో అతని కార్నియాలను గుంటూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మేఘన, కీర్తన,రాజేశ్వరిలు సేకరించారు. ఇంకొల్లు రోటరీ క్లబ్ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు, అధ్యక్ష, కార్యదర్శి, ట్రెజరర్‌లు అంజిరెడ్డి, కరి కమలేశ్వరరావు, శ్రీమన్నారాయణలు దాత కుటుంబ సభ్యులను అభినందించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 25431

చీరాల డివిజన్

90101 55593 (చీరాల)

Office mail : sakshiongads@gmail.com